నవి. పాపమతనికి కళ్ళనిండా నీళ్ళొచ్చినవి. అలాగే గంగాధరంగారి స్థితి సంభవించింది.

మళ్ళీ పాపం ఆయన పూర్వకాలపు కోటు పెట్టెలోనించి తీసి వేసుకొన్నాడు. కోర్టులో తిరిగే ఆకోటు కనపించింది. ప్లీడర్లు అంతా కోటు పోవడం మీదురదృష్టంకాదు మాదే అని అన్నారు. ప్లీడరుగుమస్తాల మొహం వాడిపోయింది. గంగాధరంగారికి ప్రపంచం అంతా దుఃఖమయంగా కనుపించింది. గుడిలోకి వెళ్లాడు. దేవుడు వున్నాడా, లేడా అని సందేహం కలిగింది. ఉంటే తనకింత అన్యాయం జరగదనిపించింది. కృష్ణదగ్గర అతనికి ఏదీ సంతోషం యివ్వలేదు. తిరిగి యింటికి వచ్చాడు. అతనికి ఆకోటుపోవడంచేత జీవితం దుఃఖభూయిష్ఠం అయినట్టు కనుపించినది.

ఆయన అలాగే పిచ్చివాడివలె తరువాత యిరవై యేండ్లు బ్రతికాడు కాని ఆకాలంలో వక్కతూరి అయినా చిరునవ్వునవ్వినట్లు నిదర్శనాలు లేవు. అతను చనిపోయినతరువాత ఆకోటు కుమారుడు తొడుక్కోవాలని ఉద్దేశపడ్డాడు కాని సాగలేదు.

ఆకోటు బెజవాడ మ్యూజియంకు పంపమని కొందరు కోరారు కాని అది జరగలేదు. ఆకోటుజేబులలో ఉన్న వస్తువులను పూర్తిగా పరీక్షచేసి వాటిని పూర్తిగా ఉపయోగించుటకు ఒక కమిషనును నియమించడానికి తీవ్రమైన ఆలోచనలు జరుగుతున్నవి.

తేనీరు

—కాంతం, కాంతం, తలుపు!

లోపలినుంచి కాంతం వచ్చి తలుపుతీసి తేనీళ్ళు తయారయినవి-అన్నది.

—తీసుకురా.

—లోపలికి దయచేయవచ్చు.

కాంతానికి టీ విషయమై వినుగు. నేను ఉపాధ్యాయ వృత్తిలో ఉండి కొద్ది వేతనంలో ఎట్లో సంసారము గడుపుతున్నాను. ఏదో వస్తే అందులోనే సంసారము గడుస్తున్నది. ఇందులో హవ్యం కవ్యం అల్లా ఉంచగా ఎన్నో ఖర్చులు. ఇటువంటి సమయంలో సొమ్ములు చేయించలేదని కాంతానికి వినుగు.

ఈ స్థితిలో ఈ బాధ పడలేక ఒక రోజు జమాఖర్చు ముందు వేసుకొని కూర్చున్నాము. ఏదైనా ఖర్చు తగ్గించటానికి వీలవుతుందేమో అని మా ఆశ.

పైనుంచి క్రిందికి పట్టీ చూచాను. అన్నీ అవసరపు ఖర్చులుగా కనిపించినవి. బియ్యం ఉప్పు పప్పు విషయంలో వివాదం లేదు. ఇక మిగతా వాటిలో కొంచెము ఘర్షణ జరిగింది.

—నెలకు రెండు సబ్బుబిళ్ళలు-ఇవి మానేద్దూ. అని నేనన్నాను.

—సబ్బుబిళ్ళలు మానవలసిందే. అయ్యో ఖర్చులు అవు

తుంటెదీనికే వచ్చినది.

—మరి ఏమి తగ్గించమంటావు.

—ఏమో నాకేమి తెలుస్తుంది.

—అవును పాపం నీకేమి తెలుస్తుంది. ప్రతినెలా రవిక గుడ్డలుకొనటం మటుకు తెలుస్తుంది.

—కోరిన సొమ్ములు లేవు సరిగదా. ఇంత కోరిన గుడ్డ అయినా కొనుక్కోవద్దు అంటారా ఏమిటి?

—మరి ఏమిటి చేయటం?

—ఏమిటి చేయటమా? టీ నీళ్ళు మానగూడదూ. కావలసినంత మిగులుతుంది. మూడు పూటలా ఆనీళ్ళే తాగుతారామె. ఎక్కడి డబ్బు అదే మింగుతుంది.

—ఆ—టీ యే మానటం. అది తాగకపోతే ఏమీ తోచదు.

—ఎందుకు తోచదూ? ఏదో పని కల్పించుకోంటే సరి!

—మనస్సు స్థిరంగా ఉండాలా పనిచేయటానికి?

—పట్టుదల ఉంటేసరి. ఈ పని మానివేయాలి ఈ పని చేయ్యాలి అని. ఈ నీళ్లేనా ఏమిటి మనిషికి పట్టుదల యిచ్చేది.

—అందుకనే మానెయ్యలేకుండా వున్నాను.

—ఏం విడ్డూరమండీ! నేను మానిపించనా?

—నేను మానలేను. నీవు మానిపించనూలేవు.

—మానరూ! మానిపిస్తే.

—పందెం.

—ఏమిస్తారు మీచేత మానిపిస్తే.

—ఏమి అడిగితే అదే.

—సరే చూడండి నాతమాషా.

కాంతం బహుటక్కరు. ఏమి టక్కు పన్నుతుందో అని భయం వేసింది నాకు. కాంతం పట్టినపట్టు నెగ్గించుకొనే మనిషి. ఆవిడ టక్కులు మన మూహించ లేము. ఇదివరలో నాకు అనుభవం కాబట్టి తగిన జాగ్రత్తలో ఉండటానికి ప్రయత్నం పడ్డాను. ఆరోజుననే మావదినగారుకూడా వచ్చింది. వారిద్దరికి గుసగుసలు రహస్య ప్రసంగములు ఎక్కువయినయి. ఈ కొంటె పిల్ల నన్నేమి అవమాన పరుస్తుందో గదా అని భయం వేసింది. వారిద్దరు కలిసి ఏదో ఒక పెద్ద కుట్ర పన్నుతున్నారని మాత్రం నాకు గట్టిగా నమ్మకం గలిగింది. నన్ను జూచి పలుమారు నవ్వటము నానమ్మకాన్ని దృఢపరిచింది.

ఆడవాళ్ళు యెంతకైనా సాహసులే. లోకంలో అనేక యుద్ధాలకు స్త్రీ కారణం. లోకంలో మాట ఎందుకు? మా యింట్లో మా కాంతం మూలంగా ఎన్ని యుద్ధాలు జరిగినవి. ఎన్ని మార్లు సంధి కుదిరింది. ఆడదాని ప్రోత్సాహం వల్ల కాదూ ఆదిపురుషుడు పాపం జేసింది!

ఆరోజు నామీద ఏదోకుట్ర పన్నుతుం దనుకొన్నాను. కుట్రపన్ని ఏంజేస్తుంది అనవచ్చును. ఆకుట్రవల్ల తనపని నెరవేర్చుకొనటమేగాక నన్ను అవమానపరుస్తుంది.

నా జాతకఫలం అటువంటిది. గోపాలపురంనుంచి జాతకఫలం సంవత్సరానికి తెప్పించా. అందులో "యీ నెలలో నీకు గొప్పఅవమానం జరుగనున్నది" అని కూడా వ్రాసి ఉన్నది. ఇంతగా భయపడటానికి కారణం ఏమిటంటే ఇదివరలో అనేక మార్లు అవమానం భరించాను. జుట్టు మంచానికి కట్టివెయ్యటం, తాంబూలంలో చింతగింజలు పెట్టటం, లేకపోతే నగంకొరికిన వక్కలు ఉంచటం, జ్ఞాపకం వచ్చినవి.

అందుకని తగినజాగ్రత్త పడ్డాను. నిద్ర లేవడంతోనే చప్పున లేవక ముందు జుట్టు స్వేచ్ఛగా ఉందీ లేనిదీ విచారించి ఝాడించి ముడివేసుకొని క్రింద ఏమీ లేకుండా చూచుకొని దిగాను. ఇప్పటికి ఒక గండం గడచింది.

కాని దానితో ఏమయినది. ఇల్లు అలకంగానే పండుగ కాలేదు. ఎన్నో గంటలు జరగాలె. క్షణంలో నన్ను అవమానపరచే శక్తి గలది కాంతం. ఆరోజు అంతా జాగ్రత్తగా ఉన్నాను. భోజన సమయములో కూరలవిషయమై పరీక్షించి మరీ తిన్నాను. పులుసులో ముక్కలవిషయమై ప్రత్యేకంగా జాగ్రత్తపడ్డాను. మధ్యాహ్నం నిద్రపోనటం మాని ఏదో పుస్తకం ముందు వేసుకొని దీక్షగా చదువుచున్నట్లు నటిస్తూ అక్కచెల్లెండ్ర ప్రసంగాలు వినేటందుకు ప్రయత్నించాను. వాళ్ళు అవతల గదిలో ఉండటంవల్ల నాకు సరిగా వినిపించలేదు. కాని కొన్ని ముక్కలు అప్పుడప్పుడు వినిపించినవి.

—నిజంగా

—మరేమిటి

—దానితరువాత నన్నునిన్ను గూడతిడితే

—తర్వాత వాళ్లిద్దరూ గుసగుస లాడారు. నవ్వుతూ మావదినగారు

—పాపం భరించలేడేమో అన్నది.

—నేజేస్తానుగా అని కాంతం ధైర్యము వొలికే కంఠముతో పలికింది.

దీనితరువాత మరేమో రహస్య ప్రసంగములు జరిగినవి. అవన్నీ ఒకపెద్ద నవ్వుతో ముగిసినవి. నాకు ఆదుర్దా ఎక్కువయింది. కాంతం వైఖరి జూస్తే నాకేమాత్రం మనశ్శాంతి లేదు. వారి సంభాషణవల్ల ఏదో భరింపరానిది నామీద వేస్తారని బోధపడ్డది. దానికితోడు కాంతం ముసిముసి నవ్వులు నా అనుమానాన్ని మరీ బలపరిచినవి. ఆనవ్వులెందుకు! ఆసంతోషమేమో! ఆరహస్య ప్రసంగాలెందుకో నాకు బోధపడలేదు. కాంతంలో రెండుభావాలు కనబడుతున్నవి. ఒకటి కొంచెం భయం. రెండోది ఒకవిధమైన సంతోషము. ఇట్టి మిళితభావప్రకటన కుట్ర కోసం అని ఎవరు గ్రహించలేరు. ఆకుట్రవల్ల నాకవమానం కలుగుతుంది. నేను తిడతానేమో అనిభయం. తానుతప్పక గెలుస్తానని సంతోషం. అయితే అంత భరింపరాని అవమానమా? భరింపరానిది ఏమిటి చెప్మా? అని ఆలోచించాను. ఏమి బోధపడలేదు ఆం. నేను భరింప లేని

కార్యాన్ని చేయటానికి కాంతం పూనుకొన్నది. వదినెగారు జంకుతున్నది. ఆ.

౨

ఇల్లా ఆలోచిస్తూ కుర్చీలో కూర్చున్నాను. ఆలోచనలో నుండగా నిద్రపట్టింది. ఇంతలో కాంతం వచ్చింది. కుర్చీ వెనుకగా వచ్చి నా కళ్ళుమూసింది. నేను ఉలిక్కిపడి లేచి చేతులు విడలించికొన్నాను. కాంతం నా ఎదుటికివచ్చి నిలుచున్నది.

—ఏమిటి కొత్త ఎత్తు ఎత్తుతున్నావు. మీ అక్కయ్యా నీవు కలసి నామీద ఏదో కుట్ర పన్నుతున్నారు. ఏమిటీ చెబుదూ?

—మీావన్నీ టక్కరు మాటలు — ఊరుకొందురూ ఈ మాట కేమిగాని నాకు మురుగులు చేయించరూ.

—చేయిస్తానులే.

—మీారు ఎప్పుడూ అల్లాగే అంటారు. నేను బతికి ఉండగా...

—అల్లా అంటేనే నాకు కోపం వస్తుంది.

—మరి నాకు మురుగులు చేయించండి.

—ఎప్పుడు.

—ఈరోజే.

—సరి బాగానే ఉంది పట్టు.

—చూడండి కొనిపించక పోతే.

—నేను చేయించ నంటే కొట్టి చేయిస్తావా అన్నాను.

కొట్టటం అంటే జ్ఞాపకం వచ్చింది. మా యిద్దరికీ మతీ చిన్నతనంలో వివాహం అయింది. వివాహంలో ఒకరోజున గంధం పూయించారు. నాకుగంధం పూయటానికి పెండ్లికూతురు వచ్చింది. మొదట వద్దు అన్నాను. మావాళ్ళంతా పూయించుకోమంటె సరే అని మెడ ఎత్తాను. మెడ క్రింద పూస్తున్నట్లే పూసి చెంపమీద లెంపకాయ కొట్టింది. అందుకని కొడతావా ఏమిటీ అని ఎప్పుడూ ఎత్తిపొడుస్తుంటాను.

కాంతం సొమ్ము విషయమై గట్టిపట్టు పట్టింది. టీ మాని పిస్తానని పంతం గట్టింది. రెండు పనులు ఒకమారే నెరవేర్చగలదు. ఎల్లాగయితే నేమి ఆ పగలు గడిచింది. రాత్రిభోజనానికి లెమ్మన్నారు. రాత్రిగడిస్తే బ్రతికినట్లే. ప్రతి విషయంలోను జాగ్రత్త పడ్డాను. భోజనానంతరము తమలపాకులు తీసికొని వచ్చింది కాంతం. ఆ యీ నెలతబుకులోనే పెట్టుకొని వచ్చింది. ఈనెలతబుకు జూచినప్పుడు మా ప్రథమ పరిచయం స్ఫురించింది. మరొక్కమారు ప్రేమవాహిని ప్రవహించింది. 'కాంతం' అని దగ్గరకు లాగుకొన్నాను. కాంతం చిరునవ్వు నవ్వి విదలించుకొని వెళ్ళిపోయింది. అల్లరిజంతువని నాలోనే ననుకొని ఒక విసిగింపునవ్వు నవ్వుకొన్నాను.

రాత్రి పడుకొన్నాను కాని నేను భరింపరాని దేమిటా అనే శంక బాధిస్తూనేవుంది. ఆట్టే నిద్రపట్టలేదు. తెల్లవారు

ఝామున మెళకువ వచ్చింది. కాంతం ఓడిపోయింది. నన్ను ఏమి అవమానం చెయ్యలేదని ధైర్యం వచ్చింది. అప్పుడు బాగా నిద్రపట్టింది. నేను మళ్ళీ మేలుకొనే టప్పటికే సుమారు ఎనిమిది గంట లవుతుంది. 'బతికానురా' బాబూ అనుకొని ఒళ్ళు తెలియని సంతోషంతో మంచం చప్పున దిగాను. కాలు క్రింద పెట్టానో లేదో భగ్గుమన్నది. భగభగమనే మంటలో కాలుపెట్టినట్లు తోచింది. కాంతం అని కేక వేశాను. కాంతం వచ్చి

—అబ్బా! చూచి దిగవద్దూ- ఆపాడు టీ కప్పు అక్కడ పెట్టి పోయినాను- చూడక ఆవేడి తేనీళ్ళు కాలిమీద పోసుకొన్నారు. ఆపాడు తేనీళ్ళు తాగవద్దంటే వినరుగా. ఒక సంవత్సరం టీ మాని వెయ్యండి. ఇటువంటి చక్కని మురుగులు వస్తాయి (అని తన ముద్దుచెయ్యి ఎత్తి నాకు చూపింది)

—ఎక్కడివి అన్నాను.

నిన్న మా అక్కయ్య తెచ్చింది. సుబ్బమ్మకు కావాలని చేయించుకొని తీసుకుని పోతుంటే నేను తీసి కొన్నాను. ధర మీరు ఒక్కమారు భరించలేరని అప్పుడప్పుడు యిచ్చేట్టు ఏర్పాటు చేశాను.

"అవును దారులుకొట్టే గకం మీది" అన్నాను. కాంతానికి ఆ బంగారపు మురుగులు ఎంతో అందంగా ఉన్నవి. 'నీ చిట్టి చిట్టి చేతులకూ- బంగారుగాజు లందమే'—అనే పదం జ్ఞాపకం వచ్చింది. మురుగులు పెట్టుకొన్న ఆ చక్కని చేతిని

అక్కై, ఒక సంవత్సరం టీ మానితే నేమి అనుకొన్నాను. హేమకంకణములతో ముద్దులు మూటగట్టుతున్న ఆ శిరీషకోమల హస్తాన్ని పైకెత్తి ముద్దుబెట్టుకో బోయాను. ఆ కొత్త మురుగులు రాచుకొని కాబోలు నా చెంప చిటుక్కుమన్నది. నేను నవ్వుతూ పులకించిన ఆ స్వన్న హస్తాన్ని వదలినాను. కరకంకణములు ఘల్లుఘల్లుమన ఆ మెకిలకిలా నవ్వుతూ పరుగెత్తినది. నా కళ్ళు అప్రయత్నంగా మూతలు పడ్డవి. నేను కళ్ళు తెరచి చూచేసరికీ నా మంచం క్రింద టీ కప్పు పగిలి ముక్కలై ఉన్నది.